కథ

# మనీపర్సు

- భమిడి వెంకటేశ్వర్లు

ఆది వారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కామరాజు యింటికి ఓ వ్యక్తి వచ్చాడు. చదువుతున్న పేపరు కింద పెట్టి అడిగాడు కామరాజు "ఎవరు కావాలి"అని.

"నమస్తే... మీతో మాట్లాడాలి" అన్నాడతను.

"మీరెవరు?... ఎక్కడుంటారు...మిమ్మల్ని నేనె ప్పుడు చూడలేదు. అయినా..." కామరాజు ప్రశ్నిస్తుంటే మధ్యలో అడ్డుపడ్డాడతను.

"నా పేరు రామచంద్రం. దయానంద్ నగర్‌లో ఉంటున్నాను. అమీర్‌పేటలో ఓ ప్రయివేటు కంపె నీలో పనిచేస్తున్నాను ఏడాది నుంచి. పదిహేను రోజుల క్రితం నా ఉద్యోగం పోయింది..." అంటూ ఏకరువు పెడుతుంటే కామరాజు కల్పించుకు న్నాడు.

"అయితే ఇక్కడ కెందుకొచ్చినట్లు? మేనేజ్‌మెం ట్‌ని రిక్వెస్ట్‌చేసి తిరిగి ఉద్యోగం సంపాదించుకోవ చ్చుగా..." అన్నాడు.

"అదంతా జరిగింది. ఫలితం లేకపోయింది. అందుకే యిక్కడికొచ్చాను. మీరు దయ తలిస్తే నాకు తిరిగి ఉద్యోగం వస్తుంది" అన్నాడు రామచంద్రం ప్రాధేయపడుతున్నట్లుగా.

కామరాజు ఆశ్చర్యపోయాడు. "నా పేరు, చిరు నామా ఎవరు చెప్పారు" అని ప్రశ్నించాడు వెంటనే.

"ఇంతకీ మీకెలా ఉంది. దెబ్బలు తగ్గాయా? వంటి నొప్పులెలా ఉన్నాయి. పెద్ద ప్రమాదమే తప్పి పోయింది దేవుడి దయవల్ల. అయినా మీకు మీ వాళ్లే తీరని అన్యాయం, ద్రోహం, మోసం చేస్తున్నారు. అసలు - వ్యవహారం యింత వరకూ ఎందుకొచ్చింది?" ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడతను.

కామరాజు అతనివైపు పరిశీలనగా, పరీక్షగా చూశాడు. ఎక్కడో చూసిన గుర్తు. మరి ఎక్కడో... ఎప్పుడో...

"నన్ను చూసిన గుర్తుందా మీకు" చటుక్కున అడిగాడు రామచంద్రం ఏదో ఆలోచిస్తూ...

'లేదు' అని మాత్రం అన్నాడు కామరాజు. కాని చూసినట్లు గానే మనసు చెబుతోంది.

"మీరు మీ తల్లిదండ్రులకు పెద్దకొడుకు అను కుంటాను. సాధారణంగా పెద్దకొడుకుని సొంతా నికి, స్వార్థానికి ఉపయోగించుకుంటారు కన్న వాళ్ళు. వారి సంపాదనని ఆడ పిల్లల వివాహాలకీ, తమ్ముళ్ళ చదువులకూ ఉపయోగించుకునే తండ్రు లెక్కువైపోతున్నారు ఎన్నో ఏళ్ళనుంచీ... ఇలా చెప్పాలంటే ఎంతైనా చెప్పవచ్చు" అంటూ ఏదో చెప్పబోయి ఆగిపోయాడు రామచంద్రం.

కామరాజుకి నిజమేననిపించింది. తనకు దాదా పుగా పాతిక ముప్పయ్ మంది పెద్ద కొడుకుల జీవితాలు, బతుకుల గురించి తెలుసు. అంతెం దుకు, తన విషయమే చాలు--

పాతికేళ్ళ క్రితం తను ఉద్యోగస్తుడయ్యాడు. తండ్రి తన జీతం మొత్తం తీసుకునే వాడు. "ఏమైనా డబ్బు అవసరమైతే అడిగి తీసుకో. అయినా నీకు డబ్బుతో పనేముంది. మేం దగ్గరు న్నాంగా" అనేవాడు తండ్రి. చివరికి నాలు గేళ్ళ కాలంలో తను పోగుట్టుకున్నదీ మిగుల్చుకున్నదీ ఆలోచిస్తే గుండె గుభేల్ మంది. అప్పడిక బదిలీకి ప్రయత్నిస్తే అన్నాడు తండ్రి "నువ్వు పెద్దాడివై పోయావు... ఎవరో నీకు చెప్పి పెడుతున్నారు..." కొడుకు జీతం తనకికి రాదన్నట్లుగా, పైగా యిలా సలహా యిచ్చాడు. "నందో, పాతికో మనియార్డరు చేయి... డబ్బు అనవసరంగా ఖర్చయిపోతుంది నీదగ్గర" అని.

తండ్రి మాటలు మెదడుని ఆలోచింపజేసాయి. తన భవిష్యత్తుని తనే మలచుకోవాలి... తన కుటుంబం కోసం తనే దారి చూసుకోవాలి. ఇక ముందు జాగ్రత్త పడక తప్పదనిపించింది.

"ఇంతకీ నాగురించి నీకేం అవసరం? నువ్వూ పెద్దకొడుకువేనా!" అడిగాడు కామరాజు నవ్వుతూ.

"అవును సార్. నా ఉద్యోగం పోయినప్పటినుంచీ నన్ను అమ్మా, నాన్నా చిన్న చూపు చూస్తున్నారు. మాట్లాడటం మానేశారు. తమకిక డబ్బురాదు కాబట్టి, నన్ను యింట్లోంచి పొమ్మంటున్నారు" రామచంద్రం కళ్లు చెమర్చాయి.

"ఇంతకీ నా దెబ్బల గురించి నీకెలా తెలుసు?" అడిగాడు కామరాజు.

"ఎందుకు తెలీదు సార్... నాకు మీ యింటి వ్యవహారాలు పూర్తిగా తెలుసు. మీ తమ్ముడు, మరదలు, నాన్నగారు, అమ్మగారు మొదలైన వారం దరి గురించీ తెలుసు. మీ తమ్ముడు సంపాదించే వస్తువుల గురించీ తెలుసు. ఇంకా చెప్పాలంటే, మీ మరదలు నడిపే కథలూ తెలుసు. ఓ విధంగా చెప్పాలంటే నా ఉద్యోగం పోవడానికి కారణం ఆమే కదా..." ఆగాడు రామచంద్రం.



"అయితే ఆమెవే రిక్వెస్ట్ చేస్తే సరిపోతుంది కదా' అన్నాడు కామరాజు.

"సార్... ఓడ ఎక్కే వరకూ ఓడ మల్లయ్యాలు... ఓడ దిగాక బోడి మల్లయ్యాలు అన్నట్లుగా, నన్ను ఉప యోగించుకుని, అవసరం తీరాక అడ్రసు మార్చేసి 'ఎవరు నువ్వు?' అన్న ఫార్ములా నా మీద ప్రయోగించిందామె. ఆడవాళ్లలో యిలా ప్రవర్తించే వారి జాబితాలో చేరిపోయింది సార్-"

"ఆమె తో నీకెలా పరిచయం..."

"వద్దులెండి... నాకు ఉద్యోగం వచ్చేలా మీరు సాయపడాలి"అంటూ కాళ్లమీద పడబోయాడు అతను.

కామరాజు వారించాడు. ఏవో ఆలోచనలు తనని వెంటాడుతున్నాయి. తనని ఎప్పుడో చూసిన గుర్తు! ఎక్కడో గుర్తు రావటం లేదు.

"సార్, ఈ రోజుల్లో మంచి, మర్యాద, గౌరవం, మానవత్వం అంటే లాభంలేదు సార్. ఇక్కడ ఇప్ప దున్న ఫార్ములా - మోసం, దగా, అన్యాయం... రక్త సంబంధీకులు, ఆత్మీయులు విరోధులవుతున్న కలియుగం. వంద రూపాయలిస్తే దారికాచి దుర్మార్గం చేస్తున్నారు. సార్, నాకు ఉద్యోగం యిప్పించండి-" మరోసారి ప్రాధేయపడ్డాడు రామ చంద్రం.


కామరాజు కిదంతా ఆశ్చర్యంగా, మిస్టరీగా ఉంది. ఏమిటీ ధోరణి... తనకు ఉద్యోగం యిప్పించడం ఏమిటి? ప్రశ్నలు వేధిస్తున్నాయి.

"అసలు మీరు ఆ రోజు అక్కడికి వెళ్లకుండా



ఉండాల్సింది. మగాళ్లని మించి ఆడవాళ్లు తెలివిగా ప్రవర్తిస్తున్నారనడానికి మీకు ఎదురైన అనుభవమే ఓ చక్కని ఉదాహరణ. ఇంతకీ మీ నాన్న గారు ఎంతిచ్చారు డబ్బు? పాతిక, ముప్ఫయ్ వేలైనా యిచ్చారా..." రామచంద్రం అన్నాడు ఆలోచిస్తున్నట్లుగా.

షాక్ తిన్నాడు కామరాజు. తను మరిచిపో-లేని సంఘటన అది... ఇతనికెలా తెలిసింది? బహుశా రామచంద్రం చెప్పినట్లుగా - ఆ యింట్లో వారి ద్వారా తెలిసి ఉంటుంది. అదంతా యిప్పుడెందుకు తవ్వుకోడం - అనిపించింది



"మీ తమ్ముడు దేవాంతకుడు సార్. అసలు పెద్ద కొడుకులు సంసారపక్షంగా, బాధ్యతగా ప్రవ ర్తిస్తే - ఆ తరువాత పుట్టే వారికి తిరుగులేని, దిక్కుమాలిన తెలివి తేటలు అబ్బుతాయనటానికి మీరూ, నేనూగా చెప్పుకోవచ్చు. నిజానికి అవసరం మనిషిని ఏపనైనా చేయనిస్తుంది... అందుకే తొందర పాటుగా చేసిన దాటికి, ఫలితం నేనిప్పుడు అను భవిస్తున్నాను" కళ్ల చెమరింపుని దాచుకున్నాడు రామచంద్రం.

"ఇంతకీ మీరొచ్చిన పనేమిటి? మీరు చెప్పేదే మిటి? ఇప్పుడు నేను చేయవలసిన దేమిటి...?

"మీరు వాగ్దానం చేస్తే చెబుతాను -"

"విషయం తెలియకుండా, ఓ కొత్త మనిషికి వాగ్దానం చేయడం ఏమిటి..." నిర్లక్ష్యంగా అన్నాడు కామరాజు.

ఎలా చెప్పలా అని ఆలోచిస్తున్నాడు రామచంద్రం

"పదిహేను రోజుల క్రితం మీకు మీ మరదలు ఫోను చేసింది - వచ్చి డబ్బు తీసుకెళ్లమన్నట్టుగా... మీరు రాగానే మిమ్మల్ని లోపల కూర్చోమని చెప్పి, ఆమె బయటకు వెళ్లిపోయింది. కానీ ఆమె వెళ్ల లేదు. అప్పుడు మీ మీద దౌర్జన్యం జరి గింది. భగవంతుడే మీకు ప్రాణభిక్ష పెట్టాడు. కానీ పదరు వ్యక్తికి - అనుకున్న డబ్బు దొరక లేదు. సరి కదా - పరాభవానికి బలయ్యాడు. పైగా తను ఓ ముఖ్యమైన వస్తువుని పోగొట్టుకున్నాడు" రామచంద్రం చెప్పడం ఆపాడు.

కామరాజు కళ్లముందు అప్పటి సన్నివేశం సినిమా రీలులా కదలసాగింది.

ఆ రోజు పన్నెండు గంటలకు జయంతి - కామరాజుకి ఫోను చేసింది. "మీరు మీ నాన్నగారిని డబ్బు అడిగారుట కదా... డబ్బు సిద్ధంగా ఉంది. మీరు వెంటనే వచ్చి తీసుకెళ్లండి. మీ నాన్నగారు రాజమండ్రి వెళ్లారు ఉదయం" అంటూ.

"సాయంత్రం వస్తాను" అన్నాడు కాముురాజు.

"ఇప్పుడే రండి. నేను స్కూలుకెళ్లి పిల్లల్ని తీసుకురావాలి. పైగా పాతికవేలు యిట్లో పెట్టి, తాళం వేసి వెళ్లే రోజులా... దానికి తోడు మా ఫ్రెండ్స్ సాయంత్రం సినిమాకు రమ్మంటున్నారు" అంది జయంతి.

ఆలోచనలో పడ్డాడు కామరాజు. చివరికి వెళ్లక తప్పలేదు.

గుమ్మంలోనే ఎదురైంది జయంతి. "లోపల కూర్చోండి, అయిదు నిమిషాల్లో వచ్చేస్తాను" అంటూ వెళ్లిందామె.

కామరాజు లోపలికెళ్లి కూర్చున్నాడు. రెండు నిమిషాల తరువాత బెడ్‌రూమ్‌లో నుంచి ఏదో కింద పడిన శబ్దం వినపడటంతో - లోపలికెళ్లాడు కామరాజు.

అంతే, లోపల వున్న వ్యక్తి అతణ్ణి మంచం మీదకు తోసేసి, గుండెల మీద కూర్చుం[illegible] బాదేసి పిడికిలితో ముఖంమీద కొట్టాడు[illegible] ఈ యింటి మీద నీకు ఏ హక్కూ లేదు. వాటా అడిగితే అడ్రస్ మిగలదు. చంపేస్తాను, ఈసారి ఈ విషయం నా దృష్టికి వస్తే..." [illegible]ంటూ పళ్లుకొరికాడు.

ఇద్దరి మధ్యా పెనుగులాట... కాముురాజు "దొంగ... దొంగ... హెల్ప్...హెల్ప్..." అంటూ అరవసాగాడు.

భగవంతుడే దయతలిచాడో... చనిపోయిన తల్లే పెద్దకొడుకుని కాపాడుకుందో - ప్రాణాలతో బయట పడ్డాడు కామరాజు. అగంతకుడు పారి పోతుంటే వెంబడించాడు కూడా. పెరటిగోడ దూకి పారిపోయాడు. అప్పుడు అతని జేబులోనుంచి ఓ పర్సు కిందపడింది. కామరాజు దానిని చటుక్కున జేబులో పెట్టేసుకున్నాడు 'దీనితో చాలా అవ[illegible] ఉంది' అనుకుంటూ.

దగ్గర్లో ఉన్న డాక్టరు దగ్గరికెళ్లి ప్రథమ చి[illegible] చేయించుకున్నాడు కామరాజు.

అరగంట తరువాత జయంతి దగ్గరకెళ్లాడు.

"ఎవరతను? బెడ్‌రూమ్‌లో ఎందుకున్నట్లు... ఏమిటీ కథ!" అనడిగాడు.


"మీరేం చెబుతున్నారో నాకు తెలియటం లేదు" అంటూ కొట్టిపారేసిందామె.

"సరే... నీకు కావలసిన వాడో, అవసరమైన వాడో అయివుంటాడు. అయినా నాకెందుకు... డబ్బు ఇచ్చేస్తే వెడతాను" అన్నాడు కామరాజు.

"డబ్బేమిటి?" ఎదురు ప్రశ్నించిందామె.

వివరంగా చెప్పాడతను.

"నేను ఫోను చేయటం ఏమిటి!... నాకు ఫోనంటేనే భయం... మీ తమ్ముడికే నేను ఫోను చేయను. ఎండలో అనవసరంగా తిరగకండి -" అంది జయంతి.



కామరాజుకి పథకం బోధపడింది.

తిరిగి ఆఫీసుకెళ్ళిపోయాడతను.

జయంతి దగ్గరకు ఓ గంట తర్వాత వెళ్లాడు ఆగంతకుడు – తనకివ్వవలసిన ఫీజు గురించి.

"నేను నిన్న ఏర్పాటు చేయడం ఏమిటి! నువ్వే నాకు తెలియదు. నేను సంసారపక్షంగా బతికే దాన్ని, రోజూ గుడికెళ్ళి ప్రదక్షిణాలు చేయడం నాకలవాటు. మావాళ్లపై ఇలా దుర్మార్గంగా అఘాయిత్యాలకు తలపడను" అంటూ. అనుకున్న వెయ్యి రూపాయలకు ఎగనామం పెట్టేసింది జయంతి.

రామ చంద్రంకిది గొప్ప షాక్. నిజానికి తను యిటువంటి పనులు చేయడు. కానీ అప్పటి పరిస్థితి, అవసరాలు యిలా ప్రేరేపించాయి.

"సరే...అయితే, ఈ టేవురికార్డరు తీసుకుపోతున్నాను... మీ అయన్ను వచ్చి తీసుకుపొమ్మను... ఇంకో దుర్మార్గం తలపెట్టడం వాకిష్టం లేదు" అంటూ ఆగంతకుడు టేవురికార్డరు తీసుకుపోయాడు.

ఇంటి కొచ్చిన మొగుడితో చెప్పింది సాయింత్రం జయంతి "మీ అన్నయ్య వచ్చి టేవురికార్డరు తీసుకెళ్ళారు. వెళ్లి తీసుకురండి" అని.

సదరు మొగుడు గారు అన్నగారితో. ఘర్షణకు దిగారు.

కామరాజుని అంతం చేసేందుకు చేసిన ఏర్పాటు బయట పడబోతోందని తెలియగానే "నువ్వే ఉంచుకో... నువ్వేం బాగు పడతావు..." అంటూ వెళ్లిపోయాడు.

ఆలోచనలు ఆగిపోయాయి.

"ఏం సార్... ఏం ఆలోచిస్తున్నారు" అన్నాడు రామచంద్రం.

కామరాజు లోపలికెళ్లి దొరికిన మనీ పర్సుని పరీక్షగా చూశాడు. అతను ఏదో ఆలోచిస్తూ రామచంద్రాన్ని గమనించాడు – అప్పుడు తనపై దౌర్జన్యం జరిపింది రామచంద్రం...! పర్సులో ఆఫీసు వారిచ్చిన గుర్తింపు కార్డు, అపాయింటుమెంట్ ఆర్డరు కాగితం ఉన్నాయి.

"సార్... నేనే మీమీద దౌర్జన్యం జరిపాను. క్షమించండి... నేను పోగొట్టుకున్న మనీపర్స్ మీకు దొరికింది. అందులో ఆఫీసు వారిచ్చిన గుర్తింపు కార్డు ఉంది. అది లేకపోతే ఆఫీసుకు రానివ్వరు" అన్నాడు రామచంద్రం.

"మరో కార్డు తీసుకో... పోయిందని చెప్పి" సలహా ఇచ్చాడు కామరాజు నవ్వుతూ.

"మా కంపెనీ రూల్సుని బట్టి కొత్త కార్డు ఇవ్వరు. సరికదా, ఆ విషయాన్ని పత్రికలో ప్రకటిస్తారు. ఇంకెలా నాకు ఉద్యోగం వస్తుంది? అక్కడికే పదిహేను రోజులు టైమ్ అడిగాను. గడువు ముగుస్తోంది కూడా..." రామచంద్రం నొచ్చుకుంటూ చెప్పాడు.

"ఇదేనా నీ గుర్తింపు కార్డు"అటూ మనీపర్సు చూపించాడు కామరాజు.

రామచంద్రం కళ్ళు ఆనందంగా మెరిశాయి.

"ఇవ్వండి సార్... మీకు వుణ్యం వుంటుంది" చేతులు జోడించాడు.

"ఎందుకివ్వాలి... నీ కారణంగా నేను ఎంతో క్షోభకు గురయ్యాను. పైగా దెబ్బలు తిన్నాను. దానికికి తోడు జయంతి మొగుడిద్వారా నలుగురిలో మానసికంగా అవమానానికి గురయ్యాను. ఈ మనీపర్సు నీ కిస్తే నీకుద్యోగం రావచ్చు... మరి నాకు తగిలిన మచ్చ ఎలా తొలుగుతుంది" తీవ్రంగా అన్నాడు కామరాజు.

"నన్నేం చేయమంటారు చెప్పండి" నొచ్చుకున్నాడతను. "జరిగినదంతా నాకు రాసియ్యి. జయంతిని, ఆమె మొగుడిని నా దగ్గరకు తీసుకు వచ్చి క్షమాపణ చెప్పించు. ఇలా చేసినా, నేను పూర్తిగా ఎటూ బయటపడను. ఏదో తృప్తి – కొంతలో కొంతగా... ఇలా చేయగలవా..." కామరాజు సూటిగా అడిగాడు.

"మీరు చెప్పినట్టే చేస్తాను. రేవు వారిని ఎలాగైనా తీసుకు వస్తాను" నిశ్చయంగా చెప్పాడు రామచంద్రం.

"రేవు నువ్వు రాకపోతే, ఎల్లుండి ఈ గుర్తింపు కార్డుని చింపేసి, నీ పర్సుని హుస్సేన్ సాగర్‌లో పడేస్తాను" అన్నాడు కామరాజు మరింత నిశ్చయంగా.

ఈ గండం నుంచి బయట పడేందుకు ఆలోచనలు కొనసాగిస్తూ వెళ్లిపోయాడు రామచంద్రం.

●●

